"రేడియో గీతం"

కుమారి శిరిపురపు జిజియ

"ఏమగునో నా హృదయనావ
పెనుతుఫాను రేగెను విషాదసాగరిలో"

అంటూ సన్నగా వినిపిస్తోంది ప్రక్కమేడలోంచి. అది సంధ్యా సమయం. సూర్యభగవానుడు పశ్చిమాద్రిలో గృంకిపోతున్నాడు. సహజ ప్రచండ భానుని పలాయనం పసిగట్టి విజయగర్వంతో చందమామ నక్షత్రముల మధ్యనుండి పయనమౌతున్నాడు. శీవెన్నెల మేను నలందుకొనిన చందినివలె హాయినిస్తోంది. ఇప్పుడు రేడియో గీతం వినిపించడం లేదు. ప్రక్కమేడమీద విద్యుద్దీపాలు వెలిగించబడినయ్. శేఖర్ తదేకంగా ఆ మేడవైపే చూస్తున్నాడు. మనుష్యుల అలజడి ఎక్కడా వినిపించడం లేదు. ఉన్నట్టుండి చటుక్కున జ్ఞాపకానికొచ్చింది తన గదిలో అంతవరకూ లైటువెయ్యలేదని. త్వరగా గదిలోకివెళ్లి లైటువేసి శరత్ "శ్రీకాంత్" తీసి చేత్తో పట్టుకున్నాడు చదువుదామని. ఇంతలోకి వీణనిమీటినట్లే మృదువుగా గానతరంగాలు శేఖర్ వీనులలోనికి జొచ్చుకొని పోయినయ్. ఎక్కడనుండా అని కొంచెంసేపు చెవులు నిక్కపొడుచుకొని విన్నాడు. చివరికి ప్రక్కమేడ గదిలోంచి అని నిర్ధారణచేసుకొని ముందు డాబామీదికి వచ్చి నిలబడ్డాడు. ఇప్పుడాపాట యింకొంచెం స్పష్టంగా విన్పిస్తోంది. ఇందాక రేడియోలో వచ్చిన గీతమే అది. ఆ గది కిటికీ తలుపులు తెరచేవున్నయ్. కిటికీ కెదురుగావున్న పడక కుర్చీలో పడుకొనివుంది యొక పడతి. ఆ లతాంగే ఆలాపిస్తోందా రేడియో గీతాన్ని. ఆ అమ్మాయి బంగారు తీవెలా మెరిసిపోతోంది. సన్నగా, ఎర్రగా సరిపడా పొడవు మనిషి. ఇరవై సంవత్సరాలవయస్సుంటుంది. ఆ విశాల నేత్రాలు, సూదిగానున్న ఆ ముక్కూ ఆమె అందంలోని కొన్ని ముఖ్య విశేషాలు. ఎర్రగా మృదువుగానున్న ఆ పెదాలు కదులుతున్నయ్. ఒక్క విషయం మాత్రం చూచినవారిని కలతబెట్టక మానదు. అంత అందంగావుండే ఆ ముఖంలో విషాద రేఖలు గోచరిస్తున్నయ్. శేఖర్‌కి ఆ విషాదరేఖలు చూడగానే మనస్సు కలచివేసినట్లయింది. ఇదివరకా అమ్మాయి నెప్పుడూ చూచివుండలేదు. ఆ అమ్మాయిని చూడటం యిదే ప్రథమం. శేఖర్ యీ యింట్లోకివచ్చికూడా రెండు రోజులే అయింది. ఆలోచించినకొద్దీ ఆమె ఆలాపించే గీతానికీ ఆమె జీవితానికీ యేదో సంబంధం వుండేవుండాలనిపించింది శేఖర్‌కి. కొంత సేపటికా అమ్మాయి ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. శేఖర్ తన గదిలోనికివచ్చి ఆలోచించడం మొదలు పెట్టాడు. ఆలోచించినకొద్దీ ఆ అమ్మాయిని గురించి తెలుసుకోవాలనేపట్టుదలయెక్కువయింది. మరునాడుదయం కాఫీవేళకి అనుకోకుండా రమేష్ ఊడిపడ్డాడు!

రమేష్, శేఖర్‌లు ఇంటర్మీడియేట్, బి. ఏ లలో క్లాస్‌మేట్స్. ఇద్దరూ మద్రాసులో చదివారు నాలుగేళ్లూ. తరువాత శేఖర్ యం.బి. బి.యస్.కు విశాఖపట్టణం వెళ్లడంవల్ల, యిద్దరూ విడిపోవలసి వచ్చింది. రమేష్ మద్రాసులోనే బి. యల్. చదివాడు. ఇద్దరి మిత్రుల మధ్యా వుత్తర ప్రత్యుత్తరాలు మాత్రం జరుగుతూండేవి. ఇద్దరూ సమ వయస్కులే. పాతికేండ్ల యువకులు. ఇప్పుడు హఠాత్తుగా రమేష్‌ని చూడగానే జ్ఞాపకం వచ్చింది శేఖర్‌కి రమేష్‌ది యీ వూరేనని. శేఖర్ రమేష్‌తో కరగ్రహణంచేస్తూ

"ఏరా! ఈ మధ్య రెండు మూడు నెలలనుండి వుత్తరాలుకూడా వ్రాయడం మానివేశావే" అన్నాడు.

"ఒరే శేఖర్! నీకంటే కోపం వస్తుందిగాని నిజంగా చెప్పరా ఎవరు మానివేశారో" అని నిలదీసి అడిగాడు గడుగ్గాయి.

నిజానికి ఆఖరు వుత్తరం వ్రాసింది రమేష్. శేఖర్ ఏదో తొందరవల్లో, లేక బద్ధకంవల్లోగాని వుత్తరానికి జవాబియ్యలేదు. అయినా వీడు యింకొక వుత్తరంవ్రాసి తగలెయ్యకూడదా అని శేఖర్ బాధ.

"శేఖర్! అయితే నీవీ వూరు వస్తున్నావనైనా ఒక కార్డుముక్క రాసి పడెయ్యకూడదూ?"

"అసలు టైమెక్కడుందిరా! ఇలా హౌస్ సర్జన్సీ ఫినిష్ చేశాను-అలా ఆర్డర్సు చేతికొచ్చాయి. ఎక్కువ వ్యవధికూడా లేకపోయింది రాయడానికి. వెంటనే రెండో రోజునే బయలుదేరి వచ్చేశా - ఎలాగో వస్తున్నాకదా అని వ్రాయలేదు. అయితే నీ విక్కడే పెట్టేవన్నమాట ప్రయివేటు ప్రాక్టీసు."

"మా ఫాదర్ సంగతి నీకు తెలుసుగా. నేను మద్రాసులో వుందామనుకుంటే ఆయన పడనివ్వలేదు. సరే నీవుకూడా యీ వూరికే వచ్చావు. చాలా బాగుంది శేఖర్" అన్నాడు తృప్తిగా రమేష్.

శేఖర్ బుర్రలో మెరపులా మెరిసింది ప్రక్కింటి అమ్మాయి. ఆ అమ్మాయి సంగతి అడుగుదామా - వద్దా అనే సందిగ్ధంలో పడ్డాడు. బహుశా రమేష్‌కి తెలిసేవుంటుంది. అడిగితే తప్పక చెబుతాడు కూడా. అయినా అడుగ సాహసించలేకపోయాడు. తరువాత చాలాసేపు వాళ్ల కాలేజీ రోజుల్లో విషయాలు మాట్లాడుకున్నారు. భోజనాలవేళకు రమేష్ శేఖర్ దగ్గర సెలవు పుచ్చుకొని యింటికి వెళ్లాడు. వెళ్తూ సాయంత్రం వాళ్ల యింటికి మిత్రుడ్ని ఆహ్వానించి మరీ వెళ్లాడు. రమేష్ వెళ్లిన తరువాత శేఖర్ భోజనం ముగించి కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్నాడు. మధ్యాహ్నం మూడింటికల్లా ఎవరో అపరచితుడు వచ్చాడు నమస్కరిస్తూ. చివరకి తేలిన సారాంశమేమంటే ఆ వచ్చిన పెద్దమనిషి శేఖర్ అసిస్టెంటు అని తెలియవచ్చింది. శేఖర్ వచ్చిన తరువాత యింతవరకూ హాస్పిటలు చూడనేలేదు. ఆ వచ్చిన వ్యక్తి (పేరు నాగేంద్రబాబు) శేఖర్‌ని తీసుకువెళ్లి హాస్పిటలు అంతా చూపించి పరిస్థితులను వివరించి తీసుకు వచ్చాడు. అది చాలా చిన్న హాస్పిటలు. మొత్తం బెడ్సు యిరవైకి మించిలేవు. మనస్సులో దానినెంతో పైకి తీసుకురావాలనుకున్నాడు శేఖర్. అచ్చట వున్నది ఒక కంపౌండరూ, ఇద్దరు వార్డుబాయిలూ - ఒక నర్సూను. శేఖర్ హాస్పిటలు నుండి తిరిగివచ్చేసరికి నాల్గుంపావయింది. రమేష్ సంగతి జ్ఞాపకంవచ్చి వెంటనే దుస్తులు మార్చుకొని బయలుదేరాడు. సాయంత్రం షికారుగా నడిచే బయలుదేరాడు. రమేష్ యిల్లు శేఖర్ వున్న వీధి చివర. అక్కడికి వెళ్ళడానికి ఆ ప్రక్కిల్లు మీదుగానే వెళ్లాలి. శేఖర్ తలవంచుకొని నడుస్తున్నాడు. ఆ మేడ ముందుకొచ్చేసరికి తలయెత్తి చూడకూడదనుకుంటూనే ఒకసారి తలెత్తి చూచాడు. అక్కడ యెవరూ కనుపించలేదు. మేడముందు భాగం చాలా అందంగావుంది. ముందు రకరకాల పూల మొక్కలు యిరుప్రక్కలా వున్నయ్. అన్నిటి నిండా రంగు రంగుల పూలు వికసించి కంటికింపుగా వున్నయ్. శేఖర్ నెమ్మదిగా నడుస్తూ రమేష్ యిల్లు చేరాడు. గేటుదాటి గుమ్మంలో అడుగు పెడ్తూ ఏదో ధ్వనికి వెనుకకు తిరిగి చూచాడు. ముందు తోటలో పూలమొక్కల మధ్య ఆడుకుంటున్నారు పిల్లలు. అందులో రమేష్ తమ్ముళ్లు, చెల్లెళ్లుకూడా వున్నారు. కేరింతలుకొడ్తూ ఆడుకొంటున్నారు. వాళ్లను చూస్తుంటే మళ్లా చిన్నతనం తిరిగివస్తే తనివితీరా ఆ ఆనందాన్ని అనుభవించాలనిపించింది శేఖర్‌కి. శేఖర్‌కే యేమిటి? మనకు మాత్రం అలా అనిపించదూ! వాళ్లకే బాధ్యతలూ లేవు. మధురమైన మనుగడలో పెరిగే చిందులాట వాళ్లది. పోయే ప్రతిరోజుకీ చిలిపిగా వీడ్కోలిస్తూ, వచ్చే క్రొత్త రోజును అమాయకంగా ఆహ్వానించే మనస్థితి వాళ్ళది. వాళ్లకి అన్ని రోజులూ ఒకేలా వుంటాయి. అందులో ఎంత ఆనందంవుంది! ఎంత మధురత్వంవుంది! నిజంగా బాల్యావస్థ తిరిగి రమ్మంటే మాత్రం తిరిగి

వస్తుందా - ఇంతలోకి అందులో ఎవరోపడిపోతే పిల్లలందరు చప్పట్లుకొట్టి నవ్వటంవల్ల ఆ శబ్దం శేఖర్ని ఈ ప్రపంచంలోకి తీసుకువచ్చింది. అంతవరకూ గుమ్మంలోనే నిలబడినవాడల్లా అప్పుడు రెండడుగులు ముందుకువేసి రమేష్ని కేకవేశాడు. రమేష్ కూడా అప్పుడే టెన్నిస్ రాకెట్ పట్టుకొని యీల వేస్తూ మేడమెట్లు దిగుతున్నవాడల్లా శేఖర్నిచూచి "ఏం! ఇంత ఆలస్యమయిందేం? ఈ వేళ యిక రావేమోనని మీ యింటిమీదుగా క్లబ్బుకు పోదామని బయలుదేరా. అలా నిలబడే వున్నావేం శేఖర్! కమాన్ టేక్ యువర్ సీట్" అంటూ టెన్నిస్ రాకెట్ని బల్లమీదపెట్టి తనూ కూర్చున్నాడు. శేఖర్ రమేష్లు టీ తీసుకున్న తరువాత షికారుకు బయలుదేరి కాళ్ళు పీకట్టేవరకు నడిచి నడిచి చివరికి ఒక మామిడితోటలో కూర్చున్నారు.

"శేఖర్! నిన్నటినుండీ చెప్దామనుకుంటూ నే చెప్పలేకపోయాను; వచ్చేనెలలో నా మేరేజి మా మేనత్త కూతురే. ఇంటరువరకూ చదివిందిలే. పెత్తనమంతా నీదేనోయ్."

"కాకపోతే - మీ మేనత్తవాళ్ళు చాలా ధనవంతులని ఎప్పుడో నాకు చెప్పినటు జ్ఞాపకం. మొత్తంమీద చాలా అదృష్టవంతుడివోయ్."

"నా అదృష్టానికేమిగాని. తమ వివాహం ఎప్పుడో మరి! నా పెత్తనం సంగతేం చేశావ్!"

"నా వివాహానికిప్పుడేం తొందరవచ్చింది రమేష్? నిజంగా నాకు పెళ్ళిచేసుకోవడం యిష్టంలేదోయ్?"

"అరరే - అదేమిమాట. ఆడవాళ్లంటే యిష్టం లేదా, లేకపోతే అసలు పెండ్లే యిష్టంలేదా? హఠాత్తుగా ఇట్లా మారిపోయావేమిటి శేఖర్."

"ఏమో. పెండ్లి అంటేనే యిష్టంలేదు. పెండ్లి చేసుకున్న దగ్గరనుండీ లేనిపోని బాధ్యతలన్నీ నెత్తిన పడతాయ్. ఇలావుంటే ఎంత హాయిగావుంది!"

"ఏడిసినట్లేవుంది వ్యవహారం. ఇంతకీ మీ ఫాదర్కి చెప్పావా పెండ్లిచేసుకోనని. అందరి డాక్టర్లకీ విరుద్ధంగా తయారయ్యావేమిటి శేఖర్!"

శేఖర్ మౌనం వహించాడు. చీకటిపడటంవల్ల యిద్దరూ యిళ్లకు బయలుదేరారు.

* * *

మరునాడు వుదయం రమేష్ శేఖర్ యింటికి వెళ్లాడు. ఇద్దరూ యేదో మాట్లాడుకొంటూ వుండగా ఆత్రుతగా ఒక మనిషి పరుగెత్తుకొనివచ్చి నమస్కారం చేశాడు శేఖర్కి. రమేష్ ఆ మనిషిని గుర్తించి "ఏం రామయ్య! ఇలా వచ్చావు?" అని ప్రశ్నించాడు.

"రమేశం బాబుగారూ! మా నారాయణం బాబుగార్కి ఎక్కువగా వుందండి ఇప్పటివరకూ బాగానే వుండారండి. ఇప్పుడే వున్నట్టుండి నిలబడబోయి పడిపోయినారండి మా నళినమ్మ గోరు ఒకటే ఏడుత్తుండారు. నేను త్వరగా ఈ డాక్టరు బాబుగార్ని తీసుకెల్దామని వొచ్చానండి" అన్నాడు.

"అయ్యో! శేఖర్ త్వరగా రావోయ్. ఏదీ నీ స్టెతస్కోపు అదీ పట్టుకురా. నువ్వు వెళ్లు రామయ్య. డాక్టరుగార్ని నేను తీసుకువస్తున్నాలే."

"పద రమేష్-ఆ నారాయణంగారెవరు? వారి కెక్కడసలు?"

"మీ ప్రక్కమేడే శేఖర్. ఆయన చాలా ధనవంతుడులే. వారికి ఒక్క అమ్మాయే, ఆమే నళిని. చిన్నప్పటి నుండి ఎంతో గారాబంగా పెంచారు. క్రింద నడవనిచ్చేవారుకారు. ఆ అమ్మాయికి సూర్యరశ్మి ఎలాంటిదో కూడ తెలియదు. అంత అల్లారుముద్దుగా పెంచారు నళినిని. ఆమె యస్. యస్. యల్. సి. చదువుతూండగా వాళ్ల అమ్మ అకస్మాత్తుగా చనిపోయింది. అంతవరకూ దుఃఖమంటే ఏమిటో ఎరగని నళిని దీనికి తట్టుకోలేకపోయింది. అంతవరకూ వున్న ఆనందమంతా మాయమయింది. స్కూలుకు వెళ్ల

మంటే భీష్మించేది. తండ్రికూడ పోనీలే ఆడపిల్లకదా. యస్. యస్. యల్. సి వరకు చదివింది - చాలులే. యింకా ఎక్కువ చదివితే నుట్టుకు వుద్యోగాలు చెయ్యాలా - అని వూరుకున్నాడు. అప్పటినుండీ నళిని అదోవిధంగా వుంటుంది. సినిమాకిగాని షికారుకిగాని ఎక్కడకీ వెళ్లదు. ఈ నాలుగేళ్లనుండి అదే విధంగా వుంటోంది..." అంటూ ఇంకా యేమో చెప్పబో పోతున్నాడు రమేష్. శేఖర్‌కి మాత్రం ఆ అమ్మాయి పరిస్థితి వినేసరికి నవనీతంలాటి అతని హృదయం కరిగిపోయింది. ఇంతలోకి వారు తోట దాటి లోపల అడుగుపెట్టటమూ, రామయ్య నారాయణరావుగారున్న గదిలోనికి వీరిని తీసుకెళ్లటమూ జరిగిపోయాయి. వారుగదిలో అడుగుపెట్టే సరికి నళిని నారాయణరావుగారి మంచంమీద తల పెట్టి వెక్కి వెక్కి ఏడుస్తోంది. రమేష్ శేఖర్‌లను చూచి కన్నీరు తుడుచుకొని తండ్రితలప్రక్కన నిలబడింది. శేఖర్ నారాయణరావుగారిని పరీక్షచేసి మరేమీ ప్రమాదంలేదని రమేష్‌కి చెప్తూ నళినివైపుకు చూచాడు. ఆమె ఎంతో ఆతృతగా వింటూ ప్రమాదంలేదని తెలిసేసరికి ఒక నిట్టూర్పు విడిచింది. ఆమె ముఖం కొంచెం తేటపడ్డది. రమేష్ అదివరకు నళినితో రెండు మూడు పర్యాయాలు మాట్లాడి వుండటంవల్ల నారాయణరావుగార్కి మరేమీ ప్రమాదంలేదని ధైర్యం చెప్తూ డాక్టరు తనస్నేహితుడేనని పేరు శేఖర్ అనీ పరిచయంచేశాడు. తరువాత శేఖర్ రోజూవచ్చి నారాయణరావుగారిని చూచి పోతూండేవాడు. అతని మందులవల్ల త్వరలోనే కోలుకున్నారు నారాయణరావుగారు.

ఒక రోజు వుదయం శేఖర్ వచ్చేసరికి నారాయణరావుగారు సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. ప్రక్కనే నళిని కూర్చొని ఏదో చదువుకుంటోంది. ఇంతలోకి శేఖర్‌లోపలికి అడుగువేయటం, నళిని లేచి నిలబడటం ఒక్కమారే జరిగాయి. నారాయణరావుగారు శేఖర్‌ని ఆహ్వానించి నళినిని కూడా పర్వాలేదు కూర్చో అమ్మా అంటూ కూర్చోబెట్టారు.

శేఖర్ "ఇప్పుడు మీకు ఒంట్లో కులాసా చిక్కిందనుకుంటాను. ఇదివరకటికీ, యిప్పటికీ యేమైనా తేడాకన్పిస్తోందా మీకు?"

"ఆ! ఇప్పుడు చాలా ఆరోగ్యంగావున్నాను. మీచేతి చలవవల్ల ఎప్పటి మనిషి నయ్యాను. మీ రుణం యేవిధంగా తీర్చుకోవాలో తెలియడంలేదు"

"ఎంతమాటన్నారు! అందులో నేను చేసిందేముంది లెండి - భగవంతుని దయవల్ల మీకు త్వరలోనే స్వస్థత చేకూరింది"

"ఇన్నిరోజులుగా మీతో పరిచయం వున్నా తమది యేవూరో తెలుసుకోలేక పోయాను శేఖర్ బాబూ!"

"స్వగ్రామం బెజవాడ. నాన్నాగారక్కడే ప్లీడరు."

"మీరేమీ అనుకోకుండావుంటే తమ యోగక్షేమ యాలు తెలుసుకోవాలని కుతూహలంగావుంది. నేనీవిధంగా అడుగుతున్నందుకు వేరేవిధంగా భావించకండి"

"అందులో అనుకోవడానికేముందిలెండి. మేము నాయుళ్లం. మా తలిదండ్రులకు ముగ్గురం సంతానం. మొగపిల్లవాడిని నేనొక్కడనే. మిగతా వారిద్దరూ నా తరువాత ఆడపిల్లల్లు. ఇంకా చదువుకుంటున్నారు. మా నాన్నగారి నామధేయం రఘునాధరావుగారు. మాయింటి పేరు కిన్నెరవారు."

"తమరి అత్తవారి స్వగ్రామం?"

"నాకింకా పెండ్లి కాలేదు"

ఈ మాటలు వినేసరికి నారాయణరావుగారి ముఖం ఆనందంతో తొణికిసలాడింది. కళ్లు తేజోవంతములైనవి. ఒకసారి నళినివైపు చూచి నిట్టూర్పు విడిచారు. నళిని కిటికీలోంచి కనిపించే పూలమొక్కల వైపు చూస్తూవుంది. ఈ సంభాషణ ఆమె చెవిదూరినట్లే కనుపించడంలేదు.

నారాయణరావుగారు "అమ్మా! కాఫీ తీసుకు రమ్మని చెప్పిరాతల్లీ" అని నళినిని పంపించి "శేఖర్ బాబూ! ఇదేవరస, వాళ్లతల్లి ఎప్పుడు చనిపోయిందో అప్పటినుండి నా చిట్టితల్లి నవ్వుముఖం ఎవ్వరమూ చూడలేదండి. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనే వుంటుంది పిచ్చితల్లి" అంటున్నారు. ఇంతలోకి నళిని వచ్చి తండ్రి పక్కగా కూర్చుంది. వంటమనిషి కాఫీ తీసుకువచ్చి అక్కడపెట్టి వెళ్లాడు. నళిని కాఫీ కలిపి తండ్రికి, శేఖర్ కి యిచ్చి, తనుకూడా తీసుకుంది.

శేఖర్ నళినినుద్దేశించి "మీ రెప్పుడూ అంత విచారంగా వుంటే నాన్నగారెంత బాధపడుతున్నారో తెలుసా! మీకంటే దురదృష్టవంతు లెంతమంది ప్రపంచంలో వున్నారో మీరాలోచించారా? అందరూ ఇదేవిధంగా వుంటున్నారంటారా? కష్టాలొచ్చినప్పుడు ధైర్యంతో ఎదుర్కోవాలిగాని బెంగతో కృంగిపోతే పెద్దవాళ్లేమవుతారో చెప్పండి" అన్నాడు.

నళిని అంతావిని శేఖర్ వైపు ఒకసారిచూచి తరువాత తండ్రివైపు చూచింది. నారాయణరావు గారు "అవునమ్మా! డాక్టరుగారు చెప్పింది అక్షరాలా నిజం. నువ్వు బాధపడుతోంటే ఈ ముసలి ప్రాణం ఇంకెంత బాధపడుతుందో యెప్పుడైనా యోచించావా తల్లీ! నీకోసమేగా నే జీవించేదికూడా" అని చెమ్మగిలిన కళ్లను తుడుచుకున్నారు. తండ్రి కన్నీరు చూచి బేజారయి "నాన్నా! మిమ్మల్నెప్పుడూ కష్టపెట్టను; నేను సంతోషంగానే వుంటానికనుండి" అంది. "అయితే యేదీతల్లీ! ఒక్కసారి నవ్వు" అన్నాడు పితృప్రేమను ఒలుకబోస్తూ నారాయణ రావుగారు. నళిని మందహాసం వల్ల ఒక్కక్షణ మా భవనమంతా దేదీప్యమానంగా వెలిగింది. ఆమె నవ్వుతూంటే సుందరంగా ఆమెబుగ్గలు సొట్టలు పడుతూంటే శేఖర్ కి ఒళ్లు జలదరించింది; ఆ నవ్వులో ఇంకా ఇంకా ఎంత అందముందో!" అనుకున్నాడు. నారాయణరావుగారు "తల్లీ! ఇక నేను చెప్పినట్లు నడుచుకోవాలమ్మా నీవు"

"అట్లాగే నాన్నా!"

"అయితే పద షికారుకువెళ్దాం. శేఖర్ బాబూ! మీరుకూడారండి" అని బలవంతం చెయ్యడంవల్ల శేఖర్ కి వెళ్ళక తప్పిందికాదు. తిరిగివచ్చే సరికి ఎనిమిదయింది. శేఖర్ సెలవుతీసుకొని వెళ్ళబోతుండగా నారాయణరావుగారు అక్కడే భోజనం చెయ్యమని బలవంతంచేశారు. ముగ్గురూ ఒక్కసారే భోజనం చేశారు. మధ్య మధ్య నారాయణరావుగారు కుమార్తెను నవ్వించాలని విసిరే ఛలోక్తులకు నళిని నవ్వుతూనేవుంది. భోజనానంతరం శేఖర్ సెలవు తీసుకొని యింటికి వెళ్ళాడు. ఇలా కాలచక్రం ఇంకా కొంచెం ముందుకు దొర్లింది.

నళిని శేఖర్ తో ఎంతో చనువుగా వుంటోంది. అయినా శేఖర్ వుండేది ప్రక్కయింట్లోనే అని ఇంతవరకూ తెలుసుకోలేక పోయింది.

అవి వెన్నెల రాత్రుళ్లు. ఒకరోజు మామూలుగా నళిని రేడియో ట్యూనుచేసి ఏవోపాటలు వస్తూంటే వింటూ ముందుడాబా మీద తిరుగుతోంది. ఇంతలోకి రేడియోలో "ఏమగునో నా హృదయనావా" అంటూ వినిపిస్తోంది. నళిని లోనకువెళ్లి దానితో తన కంఠంకూడా కలిపి పాడటం మొదలుపెట్టింది. ఆ పాట పూర్తయిన తరువాత ఆపాటే ఆలాపిస్తూ గుమ్మాని కానుకుని చంద్రుడిన్ని తిలకిస్తూంది. ఇంతలోకి ప్రక్కమేడ మీద లైటు వెలగటంవల్ల అటువైపుచూచింది. శేఖర్ నళినివైపే చూస్తున్నాడు. వారిరువురి కళ్లూ కలిసాయి. ఆమెకు సిగ్గువేసి లోపలికి పరుగెత్తుకొని పోయింది.

ఒక రోజు నారాయణరావుగారు శేఖర్ తో పెండ్లి విషయంయెత్తారు. శేఖర్ "ఇప్పుడేం తొందర లేండీ నాకు" అని తలవంచుకున్నాడు. కాని నారాయణరావుగారు అంతటితో వదిలేమనిషికాదు. అందులో ఒకే కులం, రూపసి, మంచికుటుంబంలోవాడు; విశేషంగా డాక్టరు చదివినవాడూ. అలాంటి అల్లుడు ఎంత ధనవంతుడైనా తనకి దొరకటమే దుర్ల

భమనిపించింది. శేఖర్‌కి నళిని నివ్వటాని కుద్దేశపడు తున్నట్లు సూచించాడు. శేఖర్ మందహాసంతో తల వంచుకున్నాడు. ఆ మందహాసం వికసిన బొడ్డుమల్లె మాదిరిగావుంది. నారాయణరావుగారు శేఖర్ తల్లి దండ్రులవద్దకు తగు మనుష్యులను పంపి అంతయు సిద్ధంచేశారు. వారుకూడా సుముఖులుగా వుంటంవల్ల ముహూర్తంకూడ త్వరలోనే నిశ్చయమయింది. ఒక రోజు రమేష్ సంగతంతా తెలిసికొని "పెండ్లంటేనే యిష్టంలేదా? అరె వింతవింత!" అంటూ దెప్పిపొడిచాడు. జవాబుగా శేఖర్ ఒక చిరునవ్వుమాత్రం విసిరి ఏదోపని వున్నవాడిలాగ అక్కడనుండి తప్పుకొనేవాడు. కొద్దిరోజుల వ్యవధిలోనే రమేష్ శేఖర్‌ల వివాహాలు ఎంతో వైభవంగా జరిగిపోయాయి. పెండ్లినాటి రాత్రి శేఖర్ క్రింద మిత్రులతో ముచ్చటిస్తూవుండగా నళిని మేడమీద రేడియో ట్యూను చేస్తూ కూర్చుంది. రేడియో అంటే అంత ప్రాణమామెకు! రేడియోలో యీమారే వో పాటలు వస్తున్నాయ్. నళిని కూనిరాగాలు తీస్తూ డాబామీదకువెళ్ళి పిట్టగోడ కానుకొని నిలబడి చంద్రబింబాన్ని తిలకిస్తోంది. ఆ చంద్రకాంతిలో ఆమె సుందర ముఖారవిందం మరింత అందంగా తయారయింది. ఆమె ఫాలముపై తీర్చిదిద్దిన కల్యాణతిలకం నూతన వధువును పరిచయంచేస్తోంది. ఆమె పెదవుల మీద అనిర్వచనీయమైన చిరునవ్వు నాట్యం చేస్తోంది. చందుడ్ని చూస్తూ ఆమె ఈలోకాన్నే మరచిపోయి శేఖర్ వచ్చిందికూడా గమనించ లేకపోయిందామె. శేఖర్ రేడియోగీతంలో తన కంఠాన్ని కలిపి "అందమె ఆనందం" అని పాడుతూంటే ఆ గీతంలో తన కంఠం కూడా మేళవించి ఆలాపించడం మొదలుపెట్టింది. శేఖర్ వామ బాహువు ఆమె సన్నని నడుమును చుట్టివేస్తూంటే ఆ నూతన వధువు సిగ్గిలి చటుక్కున అతని బాహువల్లరిలో నొరిగిపోయింది.

టెలిగ్రామ్స్ : సెల్ఫ్‌హెల్ప్. ఫోను. నెం. 55165

నవభారత్ ఏజన్సీస్ లిమిటెడ్

18 ఆదియప్పనాయక్ స్ట్రీటు, మద్రాసు 1.

అన్ని రకముల గాజు సామానులు

★ గృహోపకరణములకు
★ పరిశోధనాలయములకు
★ వైద్యశాలలకు
★ ఔషధములు నిల్వచేయుటకు

కావలయు సామగ్రి మావద్ద లభించును.

విక్రేతలు, పంపిణీదార్లు.

ప్రఖ్యాతిగాంచిన భారతీయ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు.